సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం। 12। మే। 2023



ఈదురుగాలుల బీభత్సం

ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలుల బీభత్సానికి భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. IIలో ▸



నాటక రంగానికి ఊపిరి

నాటకాలకు కళాపరిషత్‌లు ఊపిరిపోస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమలో అనేక పరిషత్‌లు కళాకారులకు అండగా నిలుస్తున్నాయి. IIలో ▸



లోక్ అదాలత్‌లో 31 బెంచ్‌లు

ఉమ్మడి జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో 31 బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. IIలో ▸

న్యూస్‌రీల్

మహిళల రక్షణకు దిశ చట్టం



గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: మహిళల రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ చట్టాన్ని ఏర్పాటు చేశారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులను గురువారం మంత్రి అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటమే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ బీవీ రాజు, రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పది'లో టాపర్ గాయత్రికి అభినందన



గాయత్రిని అభినందిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జే రాజేంద్రప్రసాద్

పెదపాడు: పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన గాయత్రిని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టరు జే రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. గురువారం వట్లూరులోని ఆమె ఇంటి వద్ద శాలువా కప్పి అభినందించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కేజీ నుంచి పీజీ వరకు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు.

ఆలోచనలకు పదునుపెట్టాలి



వర్చువల్‌గా మాట్లాడుతున్న ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రమోద్ పడోలే

తాడేపల్లిగూడెం: ఆలోచనలకు పదునుపెడితే అద్భుత ఆవిష్కరణలు వస్తాయని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎం.ప్రమోద్ పడోలే అన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ నిట్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ అంశంపై రెండు రోజుల వర్కుషాపు గురువారం ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను మేలైన మానవ వనరులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఆచార్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ వారి నేతృత్వంలో కొత్త ఆలోచనలు, ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాలన్నారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ శాస్త్రవేత్త డాక్టర్ వివేక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి తగిన భరోసా, ప్రోత్సాహం కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పరిశోధలు దేశానికి దిక్సూచి వంటివన్నారు. ఆధునిక సాంకేతికతలో వస్తున్న మార్పులకనుగుణంగా విద్యార్థులు తమశక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు.

దత్తత చిన్నారులకు మంచి భవిత అందించాలి

ఏలూరు(మెట్రో): దత్తత పిల్లలైన సుప్రీత, పూజశ్రీలకు మంచి భవితను అందించాలని దత్తత తల్లిదండ్రులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. గురువారం కలెక్టర్ చాంబరులో దత్తత స్వీకరణ కార్యక్రమంలో భాగంగా అన్ని అర్హతలతో దరఖాస్తు చేసుకున్న బెంగళూరుకు చెందిన చంద్రన్, సరస్వతీ శేఖర్ దంపతులకు సుప్రీతను, తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన మహినాథ్, విజిలి దంపతులకు పూజశ్రీని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమక్షంలో అప్పగించారు. ఆ ఇద్దరు చిన్నారులు బాలల సంరక్షణ శిశు గృహం సంరక్షణలో ఆశ్రయం పొందేవారు. చిన్నారుల దత్తత కోసం ఈ దంపతులు 2019లో దరఖాస్తు చేసుకోగా, చట్టపరమైన అన్ని విధివిధానాలు పూర్తి చేసిన పిదప చిన్నారులను తల్లిదండ్రులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అప్పగించి వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లలిత, డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి, బాలల రక్షణ అధికారి ఆర్.రాజేష్ పాల్గొన్నారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు

- ఇంతవరకూ 21,754 ఇళ్లు పూర్తి
- వివిధ దశల్లో 49,184 ఇళ్లు
- 609 లేఅవుట్లలో చేపట్టిన నిర్మాణాలు
- రూ.397.50 కోట్ల బిల్లులు చెల్లింపు



ఆచంట వేమవరంలో జగనన్న లే అవుట్‌లో నిర్మించిన ఇళ్లు

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల సాకారమవుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాలో 609 లేఅవుట్లలో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. సొంత స్థలం కలిగిన వారు ప్రభుత్వం సాయంతో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇంటి నిర్మాణం వేగంగా పూర్తి చేసుకుని సొంతింటికి చేరి తమ కల నేరవేరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1531.308 ఎకరాల్లో 609 లేఅవుట్లుగా చేసి 70,938 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఇంతవరకు 21,754 వేల ఇళ్లు పూర్తి చేయగా వాటిలో 21 వేల వరకు గృహప్రవేశాలు జరిగాయి. 754 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు తుదిమెరుగులు దిద్దుకుంటున్నారు.

వివిధ దశల్లో 49,184 ఇళ్లు

జిల్లా వ్యాప్తంగా శ్లాబ్, సన్‌షైన్, బేసిమెంట్ తదితర దశల నిర్మాణాల్లో 49,184 ఇళ్లు ఉన్నాయి. బేస్‌మెంట్ లెవెల్ 45,842 ఇళ్లు ఉన్నాయి. రూఫ్ లెవెల్లో 1958, స్లాబ్ లెవెల్లో 1384 ఇళ్లు ఉన్నాయి. కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లాలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎప్పటికప్పుడు హౌసింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇసుక బల్క్ పాయింట్లు ఏర్పాటు చేయించి 10 వేల నుంచి 20 వేల టన్నుల వరకు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన ఇంటి స్థలం నేడు లక్షల రూపాయల ఆస్తిగా నిలిచిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సెంటు రూ.2 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ధర పలికే విలువైన స్థలాలను ఉచితంగా అందించి తమ జీవితాలకు భరోసా ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామని లబ్ధిదారులు అంటున్నారు. అద్దె ఇంటి బాధలు తీరుతున్నాయని అద్దె ఇంటి నుంచి సొంతింటికి చేరిన లబ్ధిదారుల చెబుతున్నారు.



తాడేపల్లిగూడెంలో ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు



నరసాపురం మండలం కాళీపట్నంలో..

ఇసుక బల్క్‌పాయింట్ల ఏర్పాటు



జిల్లా వ్యాప్తంగా 609 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. 21,754 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వివిధ దశల్లో వేలాది ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తి చేసిన ఇళ్ల లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకుంటున్నారు. అవసరమైన ఇసుక కూడా సరఫరా చేయడానికి బల్క్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాం. లేఅవుట్లలో మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

జిల్లా వ్యాప్తంగా నిర్మాణాల వివరాలు

జిల్లా మొత్తం మంజూరైన ఇళ్లు	జిల్లా వ్యాప్తంగా ఇళ్ల స్థలాల లేఅవుట్‌లు
70,938	609

ఇంతవరకు మండలాల వారీగా పూర్తయిన ఇళ్లు

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు
ఆచంట	2,508	1,153
పెనుగొండ	3,528	1,114
పెనుమంత్ర	3,350	1,219
పోడూరు	2,832	1,154
భీమవరం	1,794	824
భీమవరం అర్బన్	3,199	213
వీరవాసరం	1,540	715
మొగల్తూరు	2,261	1168
నర్సాపురం అర్బన్	4,742	317
నర్సాపురం	2,925	847
పాలకొల్లు	1,298	797
పాలకొల్లు అర్బన్	2,473	173
యలమంచిలి	2,914	1,280
పెంటపాడు	2,290	1,152
తాడేపల్లిగూడెం	3,132	1,727
తాడేపల్లిగూడెం అర్బన్	3,149	638
అత్తిలి	2,478	803
ఇరగవరం	2,563	995
తణుకు	4,175	939
తణుకు అర్బన్	6,050	441
ఆకివీడు అర్బన్	1,342	197
ఆకివీడు	2,286	469
కాళ్ల	1,083	662
పాలకోడేరు	2,380	778
ఉండి	2,904	1149
గణపవరం	1,742	830

రైతులను ఆదుకున్న ఘనత

సీఎం జగన్‌దే

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అకాల వర్షాల్లో సైతం ఆర్బీకేల ద్వారా తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం దండగని, కాల్దరిలో రైతులను కాల్పించిన చంద్రబాబుకు రైతుల పక్షం అని చెప్పే అర్హత లేదని విమర్శించారు. ఏ ముఖం పెట్టుకుని ఈ ప్రాంతంలో పోరుబాట పెడుతున్నావని చంద్రబాబును నిలదీశారు. నీ యాత్ర ప్రాంతంలో ఫ్లెక్సీలు ఉంటే వచ్చిన ఇబ్బందేంటని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలుసుకుంటావనే కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. అంతేకానీ కాల్దరిలో నీవు జరిపించిన కాల్పుల్లో చనిపోయిన రైతుల ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టలేదని, టీడీపీ ఎమ్మెల్యేలు మహిళలపై చేసిన దాష్టీకాలను ఫెక్సీల రూపంలో పెట్టలేదని, అంగన్‌వాడీ కార్యకర్తలను గుర్రాలతో తొక్కించిన ఫొటోలను ఫ్లెక్సీలుగా పెట్టించలేదని అన్నారు. అలా పెట్టిఉంటే నీవు పాదయాత్ర చేయగలవా బాబూ అని ప్రశ్నించారు.

చంద్రబాబుది ఐరన్‌లెగ్

చంద్రబాబు జిల్లాలో అడుగుపెట్టగానే ఉరుములతో కూడిన ఈదురుగాలులు, వర్షాలు పడడం జరుగుతోందని దీనిని బట్టి ఆయనది పెద్ద ఐరన్ లెగ్ అనుకోవాలని మంత్రి కారుమూరి అన్నారు. ఇటీవల చంద్రబాబు వచ్చిన సమయంలో వర్షం పడిందని మళ్లీ ఐదురోజులపాటు ఎండ తీవ్రత ఉండగా ఇప్పుడు అడుగు పెడుతూనే వర్షాన్ని తీసుకువచ్చాడని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సైతం ఆయన వస్తున్నారంటే వర్షం వచ్చేస్తుందేమోనని భయపడే పరిస్థితి ఉందన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం



పేరుపాలెం బీచ్‌లో పోలీస్ అవుట్‌పోస్టు ప్రారంభించిన చీఫ్ విప్ ప్రసాదరాజు, ఎస్పీ రవిప్రకాష్

మొగల్తూరు: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, ఇటీవల లారీని దొంగిలించి డ్రైవర్‌ను హత్య చేసిన కేసును, రొయ్య లోడుతో లారీని అపహరించిన కేసులను రోజుల వ్యవధిలోనే ఛేదించి నిందితులను అరెస్ట్ చేశామన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం పేరుపాలెం బీచ్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్‌ను సందర్శించే పర్యాటకులకు అందుబాటులో ఉండేలా అవుట్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచనల మేరకు దిశ వాహనాన్ని, సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని, ప్రత్యేకంగా ఎస్సైను నియమించామన్నారు. కార్యక్రమంలో నరసాపురం మున్సిపల్ చైర్మన్ బర్రి వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, నాయకులు కర్రి ఏసుబాబు, మోటుపల్లి రాంభాస్కరరావు, బర్రి సీతారామరాజు అందే తాత, లోకం నాని, పోతుల రమేష్, కోడెళ్ళి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు

ఏలూరు (టూటౌన్): దళిత ద్రోహి చంద్రబాబు నాయుడు అని వైఎస్సార్సీపీ నాయకులు, దళిత జేఏసీ జాతీయ చైర్మన్ పెరికే వరప్రసాదరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు మాయ మాటలు ఎవరు నమ్మరని, ఆయన మాయలో ఎవరూ పడవద్దని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రవేశపెడితే దానికి వ్యతిరేకంగా కోర్టులో పిల్ వేయించి అడ్డుకున్న వ్యక్తి చంద్రబాబు నాయుడన్నారు. అమరావతి ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 54 వేల ఇళ్ల స్థలాలు ఇస్తుంటే కోర్టులో పిల్ వేయించి అడ్డుకున్న వ్యక్తి చంద్రబాబు అని అన్నారు.

3,58,740 టన్నుల ధాన్యం కొనుగోలు

సాక్షి, భీమవరం: జిల్లాలో రబీ 2022–23 సీజన్‌కు ఇంతవరకు 268 ఆర్బీకేల ద్వారా 40,152 మంది రైతుల నుంచి 3,58,740 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం విలువ రూ.731.96 కోట్లు ఉండగా ఇంతవరకు రూ.526.99 కోట్లు రైతులకు అమ్మిన 21 రోజులలోనే వారి బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేశామన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారిని నియమించి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. మిల్లు యాజమాన్యం రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇంతవరకు 10 రైస్ మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టామన్నారు. ఇంతవరకు జిల్లాలో 68 శాతం కోతలు జరగగా 56 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత రైతు భరోసా కేంద్రం, మండల అధికారులను లేదా జిల్లా కంట్రోల్ రూమ్ నెంబరు 8121676653కి ఫోన్ చేసి సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు.

పట్టాభిపై ఎమ్మెల్యే ఎలీజా ఫిర్యాదు

కారుమూరిపై వ్యాఖ్యలను ఖండించిన ఎలీజా, బీసీ నేతలు



మంత్రి కారుమూరిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పట్టాభిపై ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం: మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై టీడీపీ ప్రతినిధి పట్టాభి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జంగారెడ్డిగూడెం సీఐ బాలసురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబులకు ఎమ్మెల్యే ఎలీజా నాయకులతో కలిసి ఫిర్యాదు అందజేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రైతులపై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయం దండగ అన్న వ్యక్తి, ఇప్పుడు రైతులపై సవతి ప్రేమ చూపిస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు అండతో పట్టాభి మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై దుర్భాష లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పట్టాభి కంటే ఎక్కువగా తిట్టగలమని కానీ సంస్కారం ఉందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజియన్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాల పద్మ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను ఎదుర్కోలేక టీడీపీ నాయకులు దిగజారి మాట్లాడుతున్నారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ తమ బీసీ నాయకులను, బీసీల ప్రతినిధులను విమర్శించే హక్కు టీడీపీకి గానీ, పట్టాభికి గాని లేదన్నారు. ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సొసైటీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, బీసీ నాయకుడు గురజాల పార్థ సారథి, తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలబడ్డ వారికి కృతజ్ఞతలు: కారుమూరి

తణుకు అర్బన్: పట్టాభికి న్యాయస్థానం 41 సెక్షన్ కింద నోటీసులు జారీచేయడాన్ని స్వాగతిస్తున్నట్లు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి పొలాల వద్దకు వెళ్లి అండగా నిలబడ్డ తనపై పట్టాభి దురుసు వ్యాఖ్యలను తిప్పికొట్టి అండగా నిలబడ్డ వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

నేడు ఉద్యాన వర్సిటీ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్
- 1,192 మందికి పట్టాలు





ఉద్యాన వర్సిటీ ముఖద్వారం, వర్సిటీ పనులకు శంకుస్థాపన చేస్తున్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, అప్పటి గూడెం ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ(ఫైల్)

తాడేపల్లిగూడెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మానసపుత్రికగా, ఆయన స్మృతిపథం నుంచి చిగురులు తొడిగిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. నీతిఆయోగ్ సభ్యుడు డాక్టర్ రమేష్ చంద్ అతిథిగా పాల్గొంటున్నారు. చాన్సలర్ హోదాలో గవర్నర్, ఉపకులపతి స్థానంలో తోలేటి జానకీరామ్ ఈ కార్యక్రమాన్ని నడిపించనున్నారు. స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని విశేష ప్రతిభ కనబర్చిన వారికి బంగారు పతకాలు, విద్యార్థులకు పట్టాలు అందచేయనున్నారు. 2007లో ప్రస్తుత డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ హయాంలో గూడెంలో వర్సిటీని ఏర్పాటు చేశారు. విద్య, పరిశోధన, విస్తరణ లక్ష్యాలుగా ఏర్పడిన విశ్వవిద్యాలయం దేశవ్యాప్తంగా ఖ్యాతిని గడిస్తూ, విద్యార్థి లోకానికి మార్గదర్శనం చేస్తుంది. బాలారిష్టాలను అధిగమించి దూసుకెళ్తోంది. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంలో ఎనిమిది ఉద్యాన కళాశాలలు, 11 పాలిటెక్నిక్‌లు, 20 పరిశోధన శాలలు ఉన్నాయి. 50 ఎంఓయులు చేసుకోవడంతో పాటు.. 14 పంటలకు సంబంధించి 23 వంగడాలకు జీవం పోసింది. వాటిలో 13 రకాలు నోటిఫై అయ్యాయి. ఎక్కువ మందికి సీట్లు ఇవ్వడానికి ఎన్ఆర్ఐ, ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద అదనంగా 47 సీట్లు వచ్చాయి. విదేశీ విద్యార్థుల చేరిక పెరిగింది. విద్యార్థుల కోసం హిందీ క్లబ్, ఆంగ్ల భాష ప్రయోగశాలలు వచ్చాయి. కొత్త ప్రయోగాలకు పేటెంట్లు వచ్చాయి. లిసియాంతస్ వంటి గులాబీతో కీర్తి వచ్చింది. వాణిజ్యపరంగా మహిళలకు రకరకాల శిక్షణను ఇచ్చి ఆర్థిక స్వయం సమృద్ధి సాధించేలా కృషి విజ్ఞాన కేంద్రం క్రియాశీలక భూమిక పోషిస్తోంది.

కేవీకేకు ఉపాధ్యాయ కృషి విజ్ఞాన్ ప్రోత్సాహన్ అవార్డు

ధన్వంతరి వనాలు, గులాబీ వనాలు, ఇయర్ ఆఫ్ సిట్రస్, ఇయర్ ఆఫ్ బనానా వంటి కార్యక్రమాల రూపకల్పనకు ఉద్యాన వర్సిటీకి గుర్తింపు అవార్డులు వచ్చాయి. దేశంలోని 750 కేవీకేలతో ఉత్తమ కార్యక్రమాల నిర్వహణకు గతంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కృషి విజ్ఞాన్ ప్రోత్సాహన్ అవార్డును ప్రధాని మోడీ చేతుల మీదుగా అందుకున్న ఘనత వెంకట్రామన్నగూడెం కేవీకేకు దక్కింది.

గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు

రాష్ట్ర గవర్నర్ ప్రతిభ కనబర్చినవారికి బంగారు పతకాలు అందించనున్నారు. బెస్ట్ సైంటిస్టు, బెస్ట్ టీచర్ అవార్డు ముగ్గురికి ఇవ్వనున్నారు. 1,192 మంది పట్టభద్రులకు (బీఎస్సీ హానర్స్) పట్టాలు అందచేయనున్నారు. ఉద్యాన కోర్సుల్లో 1069, ఎంఎస్సీలో 97, పీహెచ్‌డీలో 26 మందికి పట్టాలు ఇవ్వనున్నారు. ఇంతవరకు వర్సిటీలో 2007 నుంచి 2023 వరకు 6985 మంది విద్యార్థులకు పట్టాలు ఇచ్చారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు శుక్రవారం వెంకట్రామన్నగూడెం ఉద్యాన వర్సిటీకి వస్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికార్లతో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం పరిశీలించారు. అధికార్లతో సమీక్షలో ఆమె మాట్లాడుతూ గవర్నర్ పర్యటనకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా మంచినీరు, అత్యవసర మందులు సిద్ధం చేసుకోవాలన్నారు. స్నాతకోత్సవం జరిగే ప్రాంతంలో కూలర్లు, ఏసీలు ఏర్పాటు చేయాలన్నారు. గవర్నర్ బస చేసే అతిథి గృహం, స్నాతకోత్సవ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ మేరీ ప్రశాంతి, ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకిరామ్, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, ఆర్డీఓ దాసి రాజు జిల్లా అధికారులు ఉన్నారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు



బాలిక వీపుపై గాయాలైన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరులో వీధి కుక్కల దాడిలో ఆరేళ్ల బాలికకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గుండుబోగుల దివ్య నాగ శైలు గురువారం ఉదయం రోడ్డుపైకి వచ్చి ఆడుకుంటోంది. అదే సమయంలో సమీపంలో ఉన్న 10 వీధి కుక్కలు ఒక్కసారిగా బాలికపై దాడి చేసి కరిచాయి. అంతటితో ఆగక బాలికను సుమారు 30 అడుగులు దూరం వరకు ఈడ్చుకుంటూ వెళ్లాయి. స్థానికులు స్పందించి కుక్కలను తరమడంతో ప్రాణాపాయం తప్పింది. బాలికను హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు బాలికకు చికిత్స చేసి, వీపుపై గాయానికి కుట్లు వేశారు. వ్యాక్సిన్ అందజేశారు. ఈ ప్రాంతంలో సుమారు 20 కుక్కల ఉన్నాయని, తరచుగా దారిలో వచ్చేపోయే వారిపై అరవడం, మీదకు రావడం చేస్తున్నాయని, భయంతో జీవిస్తున్నామని, కుక్కలను దూర ప్రాంతాలలో వదలిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జెడ్ఆర్‌యూసీసీ సభ్యులుగా చైతన్యకృష్ణ నియామకం



సికింద్రాబాద్‌లో రైల్వే డీజీఎం నుంచి నియామకపత్రాన్ని అందుకుంటున్న చైతన్యకృష్ణ

దెందులూరు: జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జెడ్ఆర్‌యూసీసీ) సభ్యులుగా కొవ్వలి గ్రామానికి చెందిన గుమ్మడి వెంకట చైతన్య కృష్ణను రైల్వేశాఖ గురువారం నియమించింది. ఈ మేరకు చైతన్యకృష్ణకు రైల్వే శాఖ సౌత్ సెంట్రల్ డీజీఎం ముత్యాలనాయుడు కేంద్ర ప్రభుత్వ నియామక ఉత్తర్వులను సికింద్రాబాద్ రైల్వే కార్యాలయంలో అందజేశారు. గ్రామానికి చెందిన చైతన్యకృష్ణకు పదవి కేటాయించడంపై గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నాటక రంగానికి ఊపిరి.. కళాపరిషత్‌లు

రంగస్థలానికి కళాపరిషత్‌లు ఊపిరిపోస్తున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో కళాపరిషత్‌లు నాటిక పోటీలు నిర్వహించడం ద్వారా కళాకారులను ఆర్థికంగా ప్రోత్సహిస్తూ వారి ఉనికిని కాపాడుతున్నాయి. నాటక రంగంపై ఉన్న అభిమానంతో దాతల సహకారంతో నాటిక పోటీలు నిర్వహించి పారితోషికాలు ఇవ్వడమే గాక కళాకారులను సన్మానిస్తూ నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నాయి.

సాక్షి, భీమవరం: స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి నాటక రంగానికి ప్రత్యేక స్థానం ఉంది. గతంలో ఉత్సవాలు, పండుగలకు పౌరాణిక, సాంఘిక నాటకాల ప్రదర్శనకు ఒక ప్రత్యేకత ఉండేది. కానీ రానురాను రంగురంగుల సినిమాలు, టీవీలు విస్తృతం కావడంతో కళారంగానికి ఆదరణ తగ్గుతూ వచ్చింది. గంటల తరబడి నాటకాలు చూడడానికి ప్రేక్షకులు ఆసక్తి చూపకపోవడంతో అనేకమంది కళాకారులు ఇతర వృత్తులను ఎన్నుకుని జీవనోపాధి సాగిస్తున్నారు.

కళాకారులకు అండగా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, వీరవాసరం, తోలేరు, రాయకుదురు, కొంతేరు తదితర ప్రాంతాల్లో కళాపరిషత్‌లు జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తూ కళాకారులకు అండగా ఉంటున్నాయి. 1929లో తెనాలి ఆంధ్రకళాపరిషత్ మొట్టమొదటి కళాపరిషత్‌గా ఏర్పడగా అప్పటి నుంచి అనేక సంస్థలు నాటిక పోటీలు నిర్వహిస్తున్నాయి.

ప్రతి ప్రదర్శనకూ పారితోషికం

ఒక్కొక్క పరిషత్ మూడు నుంచి నాలుగు రోజులపాటు ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది కళాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఒక్కొక్క నాటిక ప్రదర్శనకు సుమారు రూ.20 వేల వరకు పారితోషికం ఇస్తుండగా, పోటీల్లో విజయం సాధించిన నాటకానికి ప్రోత్సాహక నగదు బహుమతి ఇస్తున్నాయి. అలాగే ఉత్తమ కళాకారులకు ప్రత్యేక బహుమతులతో పాటు సన్మానం చేస్తూ వారిని మరింత ఉత్సాహపరుస్తున్నాయి. అంతేగాకుండా కళాకారులకు ఉచిత భోజనం, వసతి వంటి సౌకర్యాలు కల్పిస్తున్నాయి. ఒక్కొక పరిషత్ నిర్వహణకు దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతోంది. ఎన్నో వ్యయప్రయాసలతో నిర్వహిస్తున్న పరిషత్‌ల నాటిక పోటీలకు దాతల సహకారం కీలకం.





భీమవరంలో రంగస్థల కళాకారుడు సింహప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం (ఫైల్), భీమవరంలో కళారంజని నాటక పరిషత్ ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శన (ఫైల్)

- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 10 కళాపరిషత్‌లు
- దాతల సహకారంతో నాటక పోటీల నిర్వహణ
- రంగస్థలం పూర్వవైభవానికి ఇతోధిక కృషి

ప్రభుత్వ సహకారం అవసరం



కళాపరిషత్‌ల నిర్వహణకు ప్రభుత్వ సహకారం అవసరం. చంద్రబాబు ప్రభుత్వంలో పరిషత్‌ల నిర్వహణకు సహకారం నిలిచిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 వరకు పరిషత్‌లు నాటిక పోటీలు నిర్వహిస్తున్నాయి. దాతల సహకారం వల్లనే పోటీల నిర్వహణ జరుగుతోంది. ప్రభుత్వం సహకారం అందించి పరిషత్‌ల నిర్వహణకు కొంత సహాయం అందిస్తే కళారంగానికి అండగా ఉంటుంది.

– జవ్వాది దాశరథి శ్రీనివాస్‌రావ్, ఏపీ సాంస్కృతిక, నాటక పరిషత్‌ల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, భీమవరం

ఇండోర్ స్టేడియంలు నిర్మించాలి



పరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీల నిర్వహణకు ఇండోర్ స్టేడియంలు లేకపోవడం తీవ్ర ఇబ్బందిగా ఉంది. దీంతో పరిషత్ నాటిక పోటీలను కేవలం మార్చి, ఏప్రిల్, మే నెలల్లోనే నిర్వహించాల్సి వస్తోంది. ప్రేక్షకుల ఆదరణ కూడా ఇంకా పెరిగినపుడే మరింత ఉత్సాహంగా పరిషత్‌ల ఆధ్వర్యంలో మరిన్ని ప్రదర్శనలు నిర్వహించే అవకాశం ఉంటుంది.

– మానాపురం సత్యనారాయణ, పాలకొల్లు కళాపరిషత్

లోక్ అదాలత్‌లో 31 బెంచ్‌ల ఏర్పాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సేవా సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవా భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి సి.పురుషోత్తమ్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలియజేసారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో కోర్టులున్న అన్ని ప్రాంతాల్లో మొత్తం 31 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులకు సంబంధించి ఇన్సూరెన్స్ కంపెనీలతో సమావేశం నిర్వహించడం జరిగిందని, బాధితులు ఇన్సూరెన్స్ నష్టపరిహారాన్ని పొందుటకు బీమా కంపెనీలను సంప్రదించాల్సిందిగా కోరారు. ఇప్పటివరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 134 ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ జరిగాయని, దీని ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,350 కేసులు రాజీపడడానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మున్సిపల్ టాక్స్, చిట్ ఫండ్, కోర్టు ముందుకు రాని బ్యాంకు లావాదేవీలు, విద్యుత్ బకాయిలు, టెలిఫోన్ బకాయిలు మొదలైనవి ప్రిలిటిగేషన్ కేసులుగా రాజీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కక్షిదారులు, జాతీయ లోక్ అదాలత్ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవడం ద్వారా డబ్బు, సమయం ఆదా అవుతుందని చెప్పారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి కోరారు.

గడపగడపకు సంక్షేమం



ఉండి: ఆరేడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు పురస్కారం



ఫొటోగ్రాఫర్ రియాజుద్దీన్‌ను సత్కరించి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సిద్ధార్థ కళాశాల సెమినార్ హాలులో సాహితీ సుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నారద జయంతి కార్యక్రమం జరిగింది. జాగృతి పత్రిక మాజీ సంపాదకుడు వడ్లమూడి రామ్మోహన రావు స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. సాక్షి పత్రిక ఫొటోగ్రాఫర్ (ఏలూరు) ఎస్కే రియాజుద్దీన్‌కు ఉత్తమ ఫొటోగ్రాఫర్ పురస్కారాన్ని అందించారు. అలాగే ఉత్తమ టీవీ చానల్ జర్నలిస్ట్‌గా రెహానా (ఎన్‌టీవీ), ఉత్తమ కార్టునిస్టుగా నాగిశెట్టి వెంకట రమణమూర్తి (విజయవాడ), ఉత్తమ ప్రింట్ జర్నలిజం విభాగంలో రాజమహేంద్రవరం (హాన్స్ ఇండియా) దీక్షితులు సుబ్రహ్మణ్యంకు అందజేశారు. వ్యాపారవేత్త పి.రవికుమార్, ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దెందులూరు: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దెందులూరు– అలుగులగూడెం రైల్వే గేటు వద్ద పెదవేగి మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన పచ్చిగోళ్ళ వెంకటేశ్వరరావు (49) రైల్వే పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

యలమంచిలి: వివాహిత అయిన తన కుమార్తె అదృశ్యమైందంటూ ఓ తల్లి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎస్కే దుర్గారావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇలపకుర్రు గ్రామానికి చెందిన ఓ యువతిని అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముదినేపల్లికి చెందిన ఓ వ్యక్తితో పదేళ్ల క్రితం వివాహం చేశారు. భర్తతో విబేధాలు రావడంతో ఆరు నెలల క్రితం ఆమె గ్రామంలోని పుట్టింటికి వచ్చి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. అయితే ఈ నెల 10వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రించిన ఆమె ఉదయం కనిపించలేదు. దీంతో తన కుమార్తె కనపడటం లేదని తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాలకొల్లు సెంట్రల్: ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలో వాహనాలు తనిఖీ చేయగా యానాంకు చెందిన 12 మద్యం ఫుల్ బాటిల్స్ దొరికినట్లు ఎస్ఈబీ సీఐ ఎల్ చిరంజీవి చెప్పారు. గురువారం తనిఖీల్లో కారులో మద్యం బాటిళ్లను తరలిస్తున్న బి.జార్జి, కె.బెనర్జీలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఈబీ ఎస్సై ఖాసిం, హెచ్‌సీ వీరభద్రరావు, కానిస్టేబుల్స్ రంగారావు, వలీ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం : లైంగిక వేధింపులపై ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మైసన్నగూడెంకు చెందిన సీహెచ్ రమ్య, తన భర్తతో కలిసి కూలి పనులు చేసుకుని జీవిస్తోంది. ఆమెకు ఇద్దరు సంతానం. అదే గ్రామానికి చెందిన జుత్తుక గిరి అనే వ్యక్తి రమ్య కూలీ పనికి వెళ్లి వస్తున్న సమయంలో వెంటపడుతూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. అంతేగాక ఇటీవల ఆమె ఇంటి వద్ద ఉన్న సమయంలో గిరి అసభ్యంగా ప్రవర్తించడంతో, రమ్య భర్త అతనిని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేశాడని, ఇదే విషయాన్ని గ్రామ సర్పంచ్‌కు తెలియజేసి నప్పటికి ఫలితం లేకపోవడంతో రమ్య గురువారం స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాగి వైరు చోరీ

పెదపాడు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కొక్కిరపాడు పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి పగులగొట్టి కాపర్‌వైరును ఎత్తుకుపోయారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏఈ రాంబాబు ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- పలు చోట్ల కూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- కాలువలోకి కొట్టుకుపోయిన హైవేపై నిలిపిన ఆటో
- పి.కన్నాపురంలో చెట్టు కూలి మహిళ దుర్మరణం



ఆదిలక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



వెంకటాద్రిగూడెంలో పిడుగు పడి దగ్ధం అవుతున్న ఇల్లు



గోదావరి కాల్వలోకి ఎగిరపడ్డ ఆటో

భీమడోలు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలుల బీభత్సానికి భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో భారీ వర్షంతో కూడిన గాలులతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. మండలంలోని పూళ్ల, అంబర్‌పేట సబ్‌స్టేషన్ల పరిధిలో 100 వరకు విద్యుత్ స్తంభాలు ధ్వంసం కాగా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రధాన రహదారులపై చెట్లు కూలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఈదురుగాలులకు పూళ్ల వద్ద హైవేపై నిలిపి ఉంచిన ఖాళీ ఆటో పక్కనే ఉన్న గోదావరి కాలువలోకి పల్టీలు కొట్టింది. కోడూరుపాడులో ఇళ్ల పైకప్పుల రేకులు ఎగిరిపోయాయి.

వెంకటాద్రిగూడెంలో పిడుగు పడి ఇల్లు దగ్ధం

చింతలపూడి : మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వెంకటాద్రిగూడెంలో ఈదురుగాలులకు పిడుగు పడి వెలగం రామారావు అనే వ్యక్తికి చెందిన ఇల్లు దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇటీవల పొలం అమ్మి దాచుకున్న రూ.3 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, ఇంట్లో సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబానికి రూ.4వేల ఆర్థిక సహాయం అందజేశారు.

పి.కన్నాపురంలో..

ద్వారకాతిరుమల: పి.కన్నాపురంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులకు చెట్టు కూలి ఒక మహిళ మృతి చెందింది. పొలం నుంచి గేదెలను ఇంటికి తోలుకెళుతున్న తాడి ఆదిలక్ష్మి (24) అనే మహిళపై ఒక జామాయిల్ చెట్టు కూలింది. దీంతో చెట్టుకింద పడి ఆ మహిళ ఘటనాస్థలంలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉంటే బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణ సహాయంగా రూ. 25 వేలను అందజేశారు.

క్లుప్తంగా

వైటీరాజా కుటుంబ సభ్యులకు పరామర్శ



తణుకులో వైటీ రాజా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబు

తణుకు: తణుకు మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా కుటుంబ సభ్యులను మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం పరామర్శించారు. రైతుపోరుబాట కార్యక్రమంలో పాల్గొనేందుకు తణుకు నియోజకవర్గానికి విచ్చేసిన చంద్రబాబు మార్గమధ్యలో వైటీ రాజా నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైటీ రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లులర్పించిన చంద్రబాబునాయుడు రాజా సతీమణి నారాయణమ్మ, కుటుంబ సభ్యులు ముళ్లపూడి రేణుక, చిట్టూరి కృష్ణకన్నయ్యలను పరామర్శించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



భీమవరం వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : బాల్యంలో ఏ అంశంపై శిక్షణనిచ్చినా వెంటనే బాలలు అవగాహన చేసుకుంటున్నారని భీమవరం బార్ అసోసియేసన్ అధ్యక్షుడు ఎం.వెంకటరమణారావు అన్నారు. భీమవరం డాక్టర్ వైఎస్సార్ శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బాల్యం ఎంతో విలువైనదని రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం వారిలో మంచి స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా బాలలకు బి.నాగేశ్వరరావు తెలుగు పఠనం, ఎస్.లక్ష్మి ఆటలు, శ్యామ్ భరతనాట్యం, కె.పద్మావతి, శిరీష ఇంగ్లిష్ రీడింగ్పై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, ఉండపల్లి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సాక్షి, భీమవరం : భీమవరం ఎస్ఆర్కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మత్తుపదార్థాలు – మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ఇన్ఛార్జ్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. ఎస్ఈబీ ఇన్స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని దీనికి ప్రజలంతా సహకరించాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అంతేగాకుండా వారంతా మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల యాంటిడ్రగ్స్ కమిటీ సభ్యులు జీవీఎస్ పద్మారావు, ఏసీఎస్వీ ప్రసాద్, జి చలపతిరాజు, డి.చంద్రశేఖర్, యు.నాగబాబు, సెబ్ ఎస్సైలు జి సునీల్కుమార్, బి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల కుటుంబానికి పూర్వ విద్యార్థుల వితరణ

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణానికి చెందిన సతివాడ వెంకట సత్యనారాయణ ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. బాధితుని కుటుంబానికి స్నేహితులైన లూథరన్ హైస్కూల్ 2002–03 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.50 వేలు నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను, బియ్యం బస్తాలను అందించారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

భీమవరం అర్బన్ : అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తుందని తహసీల్దార్ వై.రవికుమార్ అన్నారు. మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో గురువారం ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో జగనన్న కాలనీలో 2019లోనే అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. కొత్తగా 82 మంది లబ్ధిదారులు ఇళ్ల స్థలాలకు అర్హులు కావడంతో గ్రామంలో ప్రభుత్వం తరుపున రైతుల వద్ద నుంచి భూమిని కొనుగోలు చేశారు. వారు కోర్టును ఆశ్రయించడంతో ఈ సమస్య కోర్టులో పెండింగ్లో ఉంది. ఈ విషయమై ఇటీవల లబ్ధిదారులు, గ్రామస్తులు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా సమస్య పరిష్కారానికై తహసీల్దార్ వై.రవికుమార్ ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఉప సర్పంచ్ బుద్దాల రామకృష్ణ, పెనుమాల నరసింహస్వామి, బోకూరి విజయరాజు, వీఆర్వో, కార్యదర్శి తదితరులు ఉన్నారు.

వేసవి శిక్షణ.. భవితకు రక్షణ

- గ్రంథాలయల్లో విద్యార్థులకు పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



పెంటపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు రాజ్యాంగంపై శిక్షణ అందిస్తున్న గ్రంథాలయాధికారి మహ్మద్ జుల్ఫికర్ అలీ

పెంటపాడు: గ్రంథాలయాలు విద్యా,జ్ఞాన సముపార్జనకు నిలయాలు. పుస్తక పఠనంతో జ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఒక్కప్పుడు గ్రంథాలయాలకు పాఠకుల తాకిడి విపరీతంగా ఎక్కువగా ఉండేది. ఉదయం, సాయంత్రం విధిగా ఆ సమయం ప్రకారం గ్రంథాలయాకు వెళ్లి పుస్తక పఠన చేసేవారు. సమయం పూర్తయినా లేచేవారు కాదు. పలు నవలలు ఇంటికి తెచ్చుకొని మరీ చదివేవారు. పాఠకులకు ఒక సభ్యత్వం ఉండేది. పోటీ పరీక్షల్లో వారే విజయం సాధించేవారు. వారికి పలు రంగాల్లో మంచి నాలెడ్జి ఉండేది. రానురానూ ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం గ్రంథాలయాలకు విద్యార్థుల రాక తక్కువ అయ్యింది. సెల్ఫోన్లకు బానిసలు కావడం, సోషల్మీడియా నేపథ్యంలో పుస్తక పఠనం పట్ల పెద్దలకు, చిన్నారులకు సైతం ఆసక్తి తగ్గింది. దీని వల్ల గ్రంథాయలకు వచ్చే పాఠకుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు ఏటా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాది వేసవి శిబిరాలను ఈనెల 8 నుంచి జూన్ 11 వరకు నిర్వహిస్తోంది.

పలు అంశాలపై శిక్షణ

గ్రంథాలయలలో ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తారు. విద్యార్థులతో కథలు చెప్పించడం, చదివించడం, స్పోకెన్ ఇంగ్లీషు, బొమ్మల తయారీ, తెలుగు పద్యాలు చదివించడం, వంటి పలు అంశాలపై శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు, వారికి మంచి జ్ఞానాన్ని అందించే ఉపాధ్యాయులు ముందుకు రావాలని గ్రంథాలయశాఖ కోరింది. పెంటపాడు, తాడేపల్లి గూడెం, తణుకు, అత్తిలి గ్రామాల్లో శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో శిబిరాలు జరుగుతున్నాయి. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారిలో సృజనాత్మక శక్తి పెరిగి తద్వారా చదువులో బాగా రాణించే అవకాశం ఉంది. అలాగే ఆయా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, మెటీరియల్ కూడా రెడీగా ఉన్నాయి. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారులు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గ్రంథాలయాల్లో సుమారు నెల రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాల జరుగుతాయి. విద్యార్థులు ఈ శిబిరాలకు హాజరు కావడం ద్వారా చదవడం, కథలు చెప్పడం నేర్చుకొంటారు. వీటిద్వారా వారిలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకత శక్తి బయటకు వస్తుంది.

– మహ్మద్ జుల్ఫికర్ అలీ,
పెంటపాడు శాఖా గ్రంథాలయాధికారి

ఆర్టీసీ బస్టాండ్లో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజరు సత్యనారాయణమూర్తి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

తణుకు అర్బన్: ప్రయాణికుల సౌకర్యార్థం తణుకు ఆర్టీసీ డిపోలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని డిపో మేనేజరు పీఎస్వీఎం సత్యనారాయణమూర్తి అన్నారు. తణుకు ఆర్టీసీ డిపోలో గురువారం తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పారిశ్రామికవేత్త మల్లిన రామచంద్రరావు సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు బసవ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి.సుధాకర్, సభ్యులు వి.హనుమంతరావు, ఎ.కాశీవిశ్వనాథం, ఐ.శ్రీదేవి, ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ కె.పున్నయ్య పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్, తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ అన్నారు. మండలంలో గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంను పటిష్టంగా అమలు చేయాలనే అంశంపై దళిత సేన రాష్ట్ర కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. జిజ్జువరపు మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదైన కేసులను సత్వరమే విచారణ వేగవంతం చేయాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. చట్టప్రకారం అందించాల్సిన ఆర్థిక సహాయం త్వరగా వచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావూరి నాగేశ్వరరావు, ఉండ్రాజవరపు కృష్ణ, జంపల్లి సుధాకర్, చీలి బాబూజీ, గడ్డం చంద్రరావు, కిలాడి రవి, కంకిపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలి



కోర్టు సముదాయల భవనం వద్ద మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్బాబు, న్యాయవాదులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో కోర్టు ఆవరణలో ఈ నెల 13వ తేదీ శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేద్దామని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్బాబు కక్షిదారులకు విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఏకాంత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ప్రకాశ్బాబు మాట్లాడుతూ లోక్ అదాలత్ ఉద్దేశ్యాన్ని చెప్పేందుకే న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులతో బైక్ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రజలు లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆయా కేసులను రాజీ చేసుకోవాలని కోరారు. టౌన్ రూరల్ సీఐలు ఎస్ఎస్వీ నాగరాజు, ఎస్వీవీఎస్ మూర్తి, సీనియర్ న్యాయవాది మాకా శ్రీనివాసరావులు మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని కక్షిదారులు లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని, రాజీ పడదగిన అన్ని కేసులను తప్పక రాజీ చేసుకోవాలని సూచించారు. బైక్ ర్యాలీ పట్టణంలో మొదటి ఫ్లైవర్ బ్రిడ్జి మీదుగా టూ టౌన్ అక్కడ నుంచి హౌసింగ్ బోర్డు, ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ మీదుగా కోర్టు ఆవరణ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్యకిరణ్ శ్రీ, ఎస్సైలు, పోలీసులు, కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం ఐక్యంగా పోరాడాలి



మండలంలో ఉపాధి హామీ కూలీలతో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామీణ ఉపాధిహామీ పథకానికి కేంద్రం తూట్లు పొడుస్తుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మండిపడ్డారు. గురువారం జగన్నపేట, బంగారుగూడెం, వీరంపాలెం, కొమ్ముగూడెం, నీలాద్రిపురం, అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో కూలీలతో ఆయన మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పనులు ప్రదేశాలలో కూలీలను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కూలీకి 200రోజులు పని దినాలను కల్పించాలని కోరారు. ఉపాధి హామీ రక్షణకు కూలీలంతా ఐక్యంగా పోరాడాలన్నారు. దేశంలో నిత్యావసర వస్తువులు పెరిగాయని, గ్యాస్ బండ ధరలు పెరిగిపోవడంతో పాటు మండలంలో అధనంగా రవాణా చార్జీలు అంటూ వసూలు చేస్తున్నారని వాపోయారు. ఈ నెల 12వ తేదీన శుక్రవారం భీమవరంలో కలెక్టరేట్ వద్ద ధర్నాకు చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులు సైతం ఈ ధర్నాలో పాల్గొనేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతా మేరీ, సీహెచ్ దానియేలు, పెదవేగి సత్యనారాయణ, నున్న శ్రీనివాస, మైలవరపు సుబ్బలక్ష్మి, చింతా నాగమణి, మందాలం కాలమ్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయవాడలో చండీ హోమ మహాలక్ష్మీ యజ్ఞం

తణుకు అర్బన్: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిర మునిసిపల్ స్టేడియంలో ఈనెల 12వ తేదీన ఉదయం 8 గంటలకు చండీ హోమ మహాలక్ష్మీ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు తణుకు వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ యజ్ఞ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నట్లు తెలిపారు. యజ్ఞ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై హర్షం



జగన్నాథపురం సచివాలయం-1లో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతతో జగన్నాథపురం సచివాలయం-1లో గ్రామస్తులచే పాలాభిషేకం నిర్వహించారు. ఎంపీపీ పోనుకుమాటి శేషలత మాట్లాడుతూ నియోజకవర్గంపై అభిమానంతో తమకు రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్లు ఏర్పాటు చేశారని, ఎంతో సంతోషంగా ఉందన్నారు. సొసైటీ డైరెక్టర్ చిట్టూరి బాపన్న, వార్డు సభ్యులు అడ్డాల గోపి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తుమ్మబత్తుల సత్యనారాయణ, యూత్ ప్రెసిడెంట్ కండెల్లి రాజేష్, నాయకులు పోసిన శ్రీను, పొట్టూరి నాగరాజు, సిర్రా ఆశీర్వాదం, మల్లిపూడి శ్రీను, నీలం నరసింహమూర్తి, లోయి శ్రీను, రటాల సూరయ్య, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అధ్యాత్మిక శక్తికి ప్రతి ఒక్కరూ లోబడి ఉండాలి



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రవక్తిని అమ్మాజీ, చర్చి పాస్టర్లు, జాజిరాజు, ఘనరాజు తదితరులు

పెంటపాడు: దేవుని అధ్యాత్మిక శక్తికి ప్రతి ఒక్కరు లోబడి ఉండాలని పడాల వాక్యజ్యోతి సువార్తికురాలు, ప్రవక్తిని కొమ్మిశెట్టి ఆమ్మాజీ పేర్కొన్నారు. పడాల వాక్యజ్యోతి చర్చి ఆధ్వర్యంలో స్థానిక గూడెం అగ్రికల్చర్ మార్కెట్యార్డు సమీపంలో ఈనెల 22 నుండిత బేతిరెడ్డి అమ్మిరెడ్డి స్థలంలో జరిగే క్రీస్తు సంపూర్ణ సువార్త స్వస్థత సభలకు సంబంధించి పోస్టర్స్ను ఆమె స్థానిక సంఘ సేవకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవక్తిని అమ్మాజీ మాట్లాడుతూ దేవుని అధ్యాత్మిక సభల ద్వారా విశ్వాసుల్లో అధ్యాత్మిక జ్ఞానం అలవడుతుందన్నారు. ఈనెల 22 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ సభలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఘనరాజు, జాజిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీటీసీ): వన్ టౌన్లోని హౌసింగ్ బోర్డు, పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ల పరిధిలో రైల్వే ఫీడర్, మహాలక్ష్మినగర్ ఫీడర్, మరమ్మతులు నిమిత్తం ఈ నెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం సాయంత్రం వెల్లడించారు. వెంకటరత్నం ఆసుపత్రి, జూబ్లీ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, పాతూరు, మహాలక్ష్మినగర్, పీ అండ్ టీ కాలనీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టణ ముస్లిం, మైనార్టీ అధ్యక్షుడిగా నౌషాద్ మొహిద్దీన్



నౌషాద్ మోహిద్దీన్కు నియామకపత్రం అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీటీసీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం పట్టణ ముస్లిం, మైనార్టీ అధ్యక్షుడిగా ఎస్కే నౌషాద్ మొహిద్దీన్ ఎంపిక అయ్యారు. 28 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. పట్టణంలో గురువారం మధ్యాహ్నం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ నియామక పత్రాలు అందజేశారు. మైనార్టీ నాయకులు షఫీ ఉర్ రెహ్మాన్, మహబూబ్ బాషా, ఎస్కే మస్తాన్, కర్రి భాస్కర్ రావు, మైనార్టీ నాయకులు ఉన్నారు. మొహిద్దీన్ మాట్లాడుతూ మంత్రి కొట్టు సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే రోజుల్లో పార్టీ బలోపేతం అవ్వడానికి తన వంతు కృషి చేస్తానని, ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు. నౌషాద్ మొహిద్దీన్కు పదవిరావడంతో ముస్లింలు, మైనార్టీలు తదితరులు అభినందించారు.

రైతుల ఇబ్బందులపై అధికారుల దృష్టి

యలమంచిలి: అకాల వర్షం వలన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవడానికి నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి, మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి గురువారం మండలంలోని గుంపర్రు, కాంభొట్లపాలెం, చింతదిబ్బ గ్రామాల్లో పర్యటించారు. నేరుగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు. వారం క్రితం కురిసిన అకాల వర్షానికి తడచిన ధాన్యాన్ని ఎలా ఆరబెట్టాలి? రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని ఏ విధంగా అమ్ముకోవచ్చో? రైతులకు వివరించారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే ఏ విధమైన చర్యలు తీసుకోవాలి? ముక్కవుతున్న ధాన్యాన్ని ఏం చేయాలో? వివరించారు. వాతావరణం రోజుకో విధంగా ఉంటున్న నేపథ్యంలో రైతులు సాధ్యమైనంత త్వరగా ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటి చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి రైతులు గణపాబత్తుల ఏసుబాబు, జడ్డు బదరీ నారాయణ, పెచ్చెట్టి శ్రీనివాసరావు, అప్పారి వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

15 నుంచి క్రైస్తవ మహాసభలు

ఉండి : ఈ నెల 15వ తేదీ 17వ తేదీ వరకు వాండ్రం గ్రామంలోని సెంయింట్ జాన్ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో క్రైస్తవ రక్షణ ఉజ్జీవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. గ్రామంలోని చర్చ్ వద్ద ప్రతి రోజు రాత్రి 7 గంటలకు నిర్వహించే ఈ సభలను పేరిష్ పాస్టర్ రెవరెండ్ వీ నెహ్రూ ప్రారంభిస్తారని ఈ సభలకు బ్రదర్ గ్రేస్విక్టర్(పాలచర్ల),బ్రదర్ ఏఆర్ పీటర్సన్(జంగారెడ్డిగూడెం),రెవరెండ్ తాజుద్దీన్మసీహా(విశాఖపట్నం) నుంచి విచ్చేస్తున్నట్లు సంఘ సీఆర్ పాలపర్తి కెప్టెన్రాజు తెలిపారు.

విద్యార్థిని అభినందించిన మంత్రి కారుమూరి



తణుకులో హైస్కూల్ విద్యార్థిని సబీహను అభినందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు పదో తరగతి విద్యార్థిని ఎండీ సబీహను రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అభినందించారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో విద్యార్థినికి మంత్రి కారుమూరి పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు. నాడు నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే కాదు విద్యావసరులు మారాయని చెప్పడానికి సబీహ లాంటి విద్యార్థులు నిదర్శనమన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధికంగా 586 మార్కులు సాధించి కార్పొరేట్ పాఠశాలలను సైతం వెనక్కి నెట్టిన సబీహను విద్యార్థులంతా స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీఎస్ఎస్ ప్రసాద్, తల్లి తండ్రులు సలీముద్దీన్, సాజీదాలను మంత్రి కారుమూరి ప్రత్యేకంగా అభినందించారు.

వేసవి శిక్షణతో సృజనాత్మకత



తణుకు పురుషుల గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల సందర్భంగా తయారు చేసిన బొమ్మలతో విద్యార్థులు

అత్తిలి: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ టీచర్ అమర్ మాట్లాడుతూ చిన్నారుల మేధస్సుకు పదును పెట్టేలా ఆహ్లాదం పంచేలా శిబిరంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. చెట్టు వలన పర్యావరణానికి కలిగే ప్రయోజనంపై స్కూల్ ఉపాధ్యాయుడు డేవిడ్రాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎ బాలాజీ, పి వెంకటేశ్వరరావు, జి గణపతి, ఎం శ్రీదేవి, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు చదివించి, చదరంగం ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు డాన్స్ నేర్పిస్తున్న ఉపాధ్యాయులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా వేసవి శిక్షణా తరగతులు

తణుకు టౌన్: విద్యార్థులకు వేసవి విజ్ఞానం, వినోదం కోసం గ్రంథాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. తణుకులోని పురుషుల శాఖా గ్రంథాలయం, మహిళా గ్రంథాలయం, వేల్పూరులోని గ్రంథాలయాల ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు. గురువారం తణుకులోని పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదవించడంతో పాటు, క్రాఫ్ట్ పేపర్తో బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రంగుల పేపర్లతో వివిధరకాల బొమ్మలను తయారు చేసి ప్రదర్శించారు. వేల్పూరు గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించడంతో పాటు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో విద్యార్థులతో కథల పుస్తకాలు, జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలను చదివించారు. కార్యక్రమంలో ఆయా గ్రంథాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): వేసవి విజ్ఞాన తరగతులు పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాల్గోవ రోజు గురువారం విద్యార్థినీ విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. స్పోకెన్ ఇంగ్లీషు, తెలుగు, హిందీ, లెక్కలు, సోషల్, సైన్స్, పజిల్స్, ఆట పాటలు, దేశభక్తి, ప్రబోదాత్మక గేయాలు నేర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు మహాశివభట్టు లక్ష్మణరాజు, ఎ.జనార్దనరావు, ప్రత్తి వీరాస్వామి, ఎస్.సాల్మన్రాజులు విద్యార్థులకు వివిధ అంశాల్లో అవగాహన కల్పించారు.